ప్రజాశక్తి
శనివారం 25 జనవరి 2025

జిసిసి గొడౌన్‌లో తనిఖీలు

పరిశీలిస్తున్న ఛైర్మన్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: స్థానిక జీసిసి గోదామును రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిసిసి ద్వారా కాఫీ, మిరియాలు కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. గత ఐదు సంవత్సరాల క్రితం వర్షాలకు గోదాము కూలి పోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వచ్చిన సరుకులు నిల్వ చేసేందుకు గోదాము లేక తాత్కాలికంగా నిర్మించుకొని వాడుతున్నామని తెలిపారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జీసీసీ లో పని చేస్తున్న రెగ్యులర్ సిబ్బందికి ప్రమోషన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు . ఈ కార్యక్రమంలో దారేల పంచాయతీ సర్పంచి పాంగి పాండురంగ స్వామి , కిల్లో లైకోన్ పాల్గొన్నారు.

అరకు ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

-అట్టహాసంగా పలు కార్యక్రమాలు
- కొలువుదీరనున్న వివిధ రకాల స్టాల్స్
-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అరకులోయ: చలి ఉత్సవ్ పేరుతో నిర్వహించ తలపెట్టిన అరకు ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం అరకులోయలోని హరిత వ్యాలీ రిసార్ట్స్ గోష్ఠి వేదికపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అరకు ఉత్సవ్ నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించడం జరిగిందని, ఆరు, ఏడు రాష్ట్రాల నుండి గిరిజన కళారూపాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ అరకు ఉత్సవము ఈనెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 31వ తేదీన ఐదు కిలోమీటర్ల మారథన్ రన్‌తో ప్రారంభమవుతుందని, అనంతరం వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన వారితో గిరిజన సాంప్రదాయాల మేళవింపుతో కార్నివాల్ ఉంటుందన్నారు. పద్మాపురం గార్డెన్స్‌లో ఫ్లవర్ షో, ప్రధాన వేదిక వద్ద వివిధ స్టాల్స్, ఫుడ్ స్టాల్స్, అమ్యూజ్మెంట్ ఉంటాయన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అరకులోయ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ ఉత్సవ్ సందర్భంగా అల్లూరి జిల్లాలోని వివిధ సందర్శిత ప్రాంతంలో కూడా లోకల్ ప్రోగ్రాములు నిర్వహిస్తామన్నారు. ఉత్సవ ప్రాంగణంలో సుమారు 30 స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సుమారు కోటి రూపాయలతో ఈ ఉత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు

ఫిబ్రవరి 1న సైకిల్ ప్రొఫెషనల్స్‌తో 20 కిలోమీటర్ల సైక్లింగ్, అరకు బొకే, ఫ్యాషన్ షో, రంగోలి, డ్రాయింగ్ లతో పాటు నృత్య ప్రదర్శనలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. మూడవ రోజు వెస్ట్రన్ డాన్స్, సాంగ్స్ ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు ఫైర్ క్రాకర్స్ ఉంటాయని వివరించారు. జి సి సి,ఎస్ ఎస్ జి గ్రూపుల ద్వారా గిరిజన సంప్రదాయ, వంటకాలు, ఉత్పత్తులు స్టాల్స్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. అరకు చలి ఉత్స వ్ సందర్భంగా అన్ని పర్యాటక ప్రాంతాలను నో ప్లాస్టిక్ జోన్ గా పరిగణించడం జరుగుతుందని, అందువల్ల పర్యాటకులు ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయం విధిగా వాడాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా అరకు చలిఉత్సవ్ ఫ్లవర్ షో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన వేదిక స్థలాన్ని పరిశీలించి పలు సలహా,సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ . అభిషేక్ గౌడ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, అరకులోయ సీఐ హిమగిరి, ఎస్సై గోపాల్ రావు, ఎం వి వి ప్రసాద్, ఎంపీడీవో లవ రాజు, డిఎల్‌పిఒ కుమార్, ఐటీడీఏ టూరిజం మేనేజర్ మురళి, లంబసింగి మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ పి.శంకర్రావు పాల్గొన్నారు.

జిసిసి ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి- పెదబయలు: స్థానికులకే జి సీ సీ ఉద్యోగాలు కల్పించాలని క్లస్టర్ పిసా కమిటీ అధ్యక్షులు, బొండా సన్నీ బాబు, బోండా సన్నిబాబు శుక్రవారం డిమాండ్ చేసారు అనంతరం విలేకరులతో సన్నిబాబు మాట్లాడుతూ, చౌక ధర దుకాణాలు (డి ఆర్ డిపో) ఖాళీగా ఉన్న సేల్స్ మాన్ పోస్టు భర్తీలో జరిగిన అవకతవకలపై వెంటనే సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసారు. స్థానిక సీతగుంట గ్రామ పంచాయతీకి , డి ఆర్ డిపో ఉన్న క్లస్టర్ పరిధిలోగల నిరుద్యోగ యువతీ యువకులకు మొదటి ప్రయారిటీ ఇచ్చి నియమించాలని కోరారు సీత గుంట గ్రామ పంచాయతీ పరిధిలో గల రోగులపేట క్లస్టర్ పరిధిలో నూతనంగా డిఆర్ డిపోను ఏర్పాటు చేశారన్నారు. డిపో పరిధిలో ఉన్న స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర పంచాయతీలకు చెందిన వారితో భర్తీ చేసేందుకు జీసీసీ యంత్రాంగం ప్రయత్నిస్తుందన్నారు.

వినతిపత్రం చూపుతున్న సన్నిబాబు

శుక్రవారం జరిగిన గ్రీవెన్స్ సమావేశంలో అల్లూరి జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పిసా కమిటీ అధ్యక్షులు, బొండా సన్నీ బాబు, కార్యదర్శి గూబారి రాధాకష్ణ, రోగుల పేట, క్లస్టర్ పీసా కమిటీ కార్యదర్శి జుంబు దేవరాజు పాల్గొన్నారు.

జన్‌మన్ గృహాలపై అవగాహన

ప్రజాశక్తి -చింతపల్లి: ప్రధానమంత్రి జన్ మన్ గృహాలను సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బాబు అన్నారు. మండలంలోని అంజలి శనివారం పంచాయతీ లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆ శాఖ ఏఈ రమణ బాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అల్లూరి జిల్లాలో ఇప్పటివరకు మొదటి, రెండవ విడతలలో 28,583 గృహాలు మంజూరు కావడం జరిగిందన్నారు. అంజలి శనివారం పంచాయతీ కి మూడవ విడతలో భాగంగా జిల్లా కలెక్టర్ చొరవతో 229 గృహాలు మంజూరు అయ్యాయన్నారు. ఈ లబ్ధిదారులంతా భార్యాభర్తలు ఇరువురు బ్యాంక్ ఖాతాలను కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ సర్పంచ్ పేట్ల రాజబాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణ బాబు, వర్క్ ఇన్స్పెక్టర్ రాజారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బాబు

కూలిరేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని

జిసిసి, సివిల్ సప్లయి హమాలీల సమ్మె

రంపచోడవరంలో నిరసన తెలుపుతున్న హమాలీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

జిసిసి, సివిల్ సప్లై హమాలీలకు కూలి రేట్లు పెంచుతామని 2024 జనవరి నెలలో చేసుకున్న ఒప్పందానికి తక్షణమే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం వారు సమ్మెకు దిగారు. ఈ మేరకు రంపచోడవరం పౌరసరఫరా గిడ్డంగి వద్ద శుక్రవారం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అగ్రిమెంట్ చేసి సంవత్సరకాలం గడిచినా ఇప్పటికీ అమలు చేయలేదని, దీనిపై ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎటువంటి జీవో కూడా విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హమాలీలకు కూలి రేట్లు పెంచాలని, జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి సుబ్బారావు, సిహెచ్ అప్పారావు, స్వామి, రాజబాబు, బాబురావు, హమాలీలు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : జిసిసి, సివిల్ సప్లయి హమాలీలకు కూలి రేట్లు పెంచుతూ జీవో వెంటనే విడుదల చేయాలని, 2024 దసరా సందర్భంగా ఇవ్వవలసిన యూనిఫామ్ ఇవ్వాలని, హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అడ్డతీగల జివిసి గోదాము వద్ద ధర్నా నిర్వహించారు. జిసిసి హమాలీలు గోడౌన్స్‌లో పనులు బంద్ చేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జిసిసి హమాలీస్ యూనియన్ కార్యదర్శి ఎం.రాజబాబు మాట్లాడుతూ ఏడాది గడిచినా నేటికీ జీవో విడుదల చేయకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయకుంటే 26 జిల్లాల్లోనూ సమ్మె చేస్తామని హెచ్చరించారు. హమాలీల బంద్‌కు మద్దతు తెలియజేసిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు మాట్లాడుతూ హమాలీల న్యాయమైన కోరికలను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు.

అడ్డతీగలలో....

మెరుగైన వైద్య సేవలకు ఇంటింటి సర్వే

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఇంటింటి సర్వే ఆశా వర్కర్ల ద్వారా నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఆశా కార్యకర్తల క్షేత్రస్థాయి ఆరోగ్య సేవలు పుస్తకాన్ని శుక్రవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తన ఛాంబర్‌లో ఆశా వర్కర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు మండలాల్లో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని, ఫీవర్ కేసులను గుర్తించేందుకు ఈ ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయావ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆదేశించారు. నెలలు నిండిన గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ చేసే విధంగా ఎక్కడికక్కడ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ ఏడిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జి.శిరీష, ఏపీఓ జనరల్ డిఎన్‌వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిపిఎం అపర్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు క్షేత్రస్థాయి పుస్తకాలు అందించిన ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

'మీకోసం'కు 109 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ, జెసి

ప్రజాశక్తి-పాడేరు : సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పిఓ వి, అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్య మన్ పటేల్, డిఆర్ఓ కె.పద్మలత సంయుక్తంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదార్ల నుండి 109 అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలు, రహదారుల నిర్మాణాలు, తాగునీటి సమస్యలు, విద్యుత్ సదుపాయాలు వంటి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. మీకోసం లో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పాడేరు మండలం వనుగు పల్లి పంచాయతీ చింత గున్నలు గ్రామానికి చెందిన పాంగి రామారావు చింత గున్నల నుండి డుముల మామిడి గ్రామానికి రోడ్డు నిర్మించే క్రమంలో తన కాఫీ తోటను ధ్వంసం చేశారని నష్టపరిహారం అందించాలని వినతి పత్రం సమర్పించారు. కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ పొర్లుబంధ గ్రామస్తులు ఎం. రాజబాబు, కె .రాజకుమార్‌లు రోడ్డు మంజూరు చేయాలని దరఖాస్తును అందజేశారు. అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ సంకుపర్తి, మెట్టవలస, గాలిపాడు, గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలని పలువురు వినతి పత్రం సమర్పించారు. చింతపల్లి మండల పంచాయతీ కిటుముల పలడ గ్రామస్తుడు బాపవి విజయ అరవింద్ కుమార్ వ్యవసాయ బోరు మంజూరు కోసం వినతి పత్రం అందజేశారు. జిమాడుగుల మండలం బొయితిలి పంచాయతీ రొయ్యలగడ్డ గ్రామానికి గ్రావెల్ రోడ్డు మంజూరు చేయాలని వి. ఏలియా, జి .సన్యాసిరావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎల్. రజిని, డిఆర్డిఏ పిడి వి.మురళి, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్ .కుమార్, డిఎం అండ్ హెచ్ఓ జమాల్ బాషా, డి సిహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, రహదారులు భవనాల శాఖ ఈఈ బాల సుందర్‌బాబు, ఈఈ టీ .కొండయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

వంటా వార్పు నిర్వహిస్తున్న బాధితులు

కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనం నిర్మాణానికి సాగు భూములు దానం చేసిన బాధిత నిర్వాసిత గిరిజనులు ఆందోళన కొనసాగింది. ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ ఏకలవ్య పాఠశాల ఎదుట ప్రారంభించిన ఆందోళన శుక్రవారం రెండవ రోజు కూడా కొనసాగింది ఈ సందర్భంగా శిబిరం వద్ద వంటావార్పు చేసి బాధిత కుటుంబీకులు భోజనాలు చేసి ఆందోళన చేపట్టారు. పాఠశాల నిర్మాణం కోసం భూములు అడిగినప్పుడు ఉద్యోగాలు ఇస్తామని అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కొనసాగిస్తామని బాధిత గిరిజనులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరిజన కుటుంబీకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల పరిధిలోని విద్యుత్ మరమ్మతు చేపట్టేందుకు ఈనెల 25న విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని పాడేరు డివిజనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి ఏవిఎన్ఎమ్ అప్పారావు తెలిపారు. డిసెంబర్ నెలలో కురిసిన వర్షాల కారణంగా విద్యుత్తు వైర్లు పలుచోట్ల తెగి పోయాయని, వీటి మరమ్మత్తు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. చింతపల్లి మండలం పరిధిలోని అన్నవరం, లోతుగడ్డ, బలపం ప్రాంతాలతో పాటు జీకే వీధి మండలంలోని రింతాడ, సంకాడ, పెదవలస, రంపుల ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - చింతపల్లి: రక్తదానం ఎంతోమందికి ప్రాణదానమని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జి ప్రభావతి అన్నారు. విశాఖ పట్నం కి చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్థానిక ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 40 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం ఎంతో మందికి ప్రాణదానమే కాకుండా రక్తదాతలకు సైతం ఆరోగ్యదాయకం అన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నంత వరకు రక్తం దానం చేయడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్సింగ్ సూపరిండెండెంట్ పద్మావతి, చింతపల్లి, జీకే వీధి ఎస్సైలు వెంకటేశ్వరరావు, అప్పలసూరి, బ్లడ్ స్టోరేజ్ లాబ్ టెక్నీషియన్ అనిల్, ఇండియన్ రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దాతలు

26న రక్తదాన శిబిరం

పాడేరు: ఈనెల 26 న రిపబ్లిక్ డే రోజున ఆదివారం పాడేరులో ఆల్ ఇండియా తౌహీద్ జమాత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా మహా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు అనీష్, కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, కోశాధికారి అబ్దుల్ బషీద్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో భారీ ఎత్తున 75వ రిపబ్లిక్ డే పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారని ఔత్సాహికులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు శాఖ కార్యవర్గం పిలుపు నిచ్చింది. ప్రతి ఏడాది భారీగా ముస్లిం సోదరులు నిర్వహించే ఈ 17వ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో అనేకమంది రక్తహీనతతో బాధ పడుతున్నారని, గర్భవతులు ప్రసవ సమయంలో, ప్రమాదాల బారిన పడినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో రక్తపు నిలువలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముస్లిం సోదరులు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ గంగరాజు, ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్, కోశాధికారి సూర్యారావు ప్రకటనలో పేర్కొన్నారు.

పింఛను మంజూరుకు చర్యలు

- ప్రజాశక్తి కథనానికి స్పందించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : మండల కేంద్ర అడ్డతీగల వాల్మీకి నగర్‌కు చెందిన సాదే గైరమ్మ (70 సంవత్సరాలు) అనే వృద్ధురాలకు పింఛను మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ కెఆర్.విజయ తెలిపారు. పింఛను కోసం గైరమ్మ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పెన్షన్ ఇచ్చే నాథుడే కరువైన నేపథ్యంలో 'పింఛను ఇప్పించండి మహాప్రభో' శీర్షికన శుక్రవారం ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన స్థానిక ఎంపీడీవో విజయ జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడి ఆమెకి వెంటనే పెన్షన్ ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటున్నట్లుగా తెలిపారు. దీంతో బాధితురాలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె లాగే మరికొందరు ఉన్నారని, వారికి కూడా న్యాయం చేయాలని కోరుతున్నారు.

వాతంగి పీసా ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి విజయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి గ్రామ పీసా కమిటీ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి మనుగుల దేవుడు ఎన్నికయ్యారు. ఈ పీసా కమిటీ ఎన్నికలు ఆరు సార్లు వాయిదా పడ్డాయి. చివరికి శుక్రవారం పోలీసుల పహార మధ్య 7వసారి ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పీసా కమిటీ ఎన్నికల్లో టిడిపి, వైసీపీని కాదని ఏకపక్షంగా సీపీఎం అభ్యర్థి మనుగుల దేవుడను గిరిజనులు గెలిపించారు. గ్రామసభను అడ్డుకోవాలని చూసిన వైసిపి నాయకులపై గ్రామస్తులు తిరగబడ్డారని సిపిఎం నాయకులు తెలిపారు. ఈ గ్రామసభలో సర్పంచ్ భవాని, వైస్ ఎంపిపి రాజేశ్వరి, అర్జున్, పలువురు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో ఖాళీగా ఉన్న 34 రేషన్ షాపుల డీలర్ల ఎంపిక నిమిత్తం రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ సమక్షంలో శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ ఛాంబర్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని రాజవొమ్మంగి మండలంలో 9 రేషన్ డీలర్ షాపులు, అడ్డతీగలలో 2, మారేడుమిల్లిలో 7, రంపచోడవరంలో 5, దేవీపట్నంలో 5, గంగవరంలో 4, వై.రామవరం మండలంలో 2, మొత్తం 34 రేషన్ డీలర్ల షాపులకు 308 మంది దరఖాస్తులు సమర్పించినట్లు చెప్పారు. ఇందులో 305 మంది రేషన్ డీలర్ల రాత పరీక్షకు హాజరయ్యారని, వారిలో కమిటీ ద్వారా ఎంపికైన వారందరినీ రేషన్ డీలర్లుగా నియమించడం జరుగుతుందన్నారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా కమిటీ ద్వారా ఒక్కొక్క అభ్యర్థికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, సిడిపిఓ సంధ్యారాణి, మండల విద్యాశాఖ అధికారి యం. రామకృష్ణ, ఏఎస్ఓ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ఉత్తమ ఎఇఆర్‌ఒగా తహశీల్దారు రామకృష్ణ

ప్రజాశకి-రంపచోడవరం : ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఎఇఆర్ఒ)గా రంపచోడవరం తహసీల్దార్ పి.రామకృష్ణను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఎంపిక చేసింది. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా రామకృష్ణను గుర్తించారు. ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం అవార్డు ప్రధానోత్సవానికి హాజరుకావాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి రామకృష్ణకు పిలుపు వచ్చింది. మండలంలోని బిఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది ఉమ్మడి కృషి, శ్రమ వల్లనే ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించగలినట్లు ఈ సందర్భంగా రామకృష్ణ తెలిపారు. ఇందుకు అన్ని విధాల తగిన సూచనలు ఇచ్చిన అల్లూరి జిల్లా కలక్టర్ దినేష్ కుమార్‌కు రంపచోడవరం సబ్ కలక్టర్ కెఆర్.కల్పశ్రీకు ధన్యవాదాలు తెలియజేశారు.

డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీ అన్ని మండలాల్లోని మెడికల్ షాపులలో పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్ మందులు రిజిస్టర్ వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించకూడదని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలు అతిక్రమించి అమ్మితే క్రిమినల్ కేసులు పెడతామని ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మితే క్రిమిషనల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాధవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-చింతపల్లి : వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచించారు. శుక్రవారం మండలాధ్యక్షుడు కిలో పూర్ణచందర్రావుతో కలిసి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. రోగులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై సూపరింటెండెంట్ ప్రభావతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి శిశువులకు అందుతున్న వైద్య సేవలు, ఆక్సిజన్ నిలువలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లారు. గత వైకాపా ప్రభుత్వం పేదల వైద్యంపై పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రోగులకు అసౌకర్యం కలగకుండా వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఐదేళ్లలో గాడి తప్పిన పాలన

గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న పరిస్థితులను సర్పంచ్‌లు గుర్తు తెచ్చుకుని ప్రకటనలు ఇవ్వాలని తెదేపా పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ కొత్త పాకలు గ్రామంలో ఆ పంచాయతీ సర్పంచ్ చింతర్ల సునీల్, ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబురావు ల ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం సర్పంచ్ సునీల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గాడి తప్పిన రాష్ట్ర అభివృద్ధిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే గాడిన పెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం ప్రభంజనం ఉన్నప్పటికీ మన్య ప్రాంతంలో అమాయకులైన గిరిజనులు వైకాపాను ఆదరించి శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా అవకాశం కల్పిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా అర్థం లేని ప్రకటనలతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. సర్పంచులు సైతం గత ప్రభుత్వంలో వారు ఎదుర్కొన్న పరిస్థితులను మరచిపోయి ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, పెదిరెడ్ల బేతాళుడు, గెమ్మెల అబ్బాయి నాయుడు, అరకు పార్లమెంట్ ఎస్సీ సెల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుందూరు రాజు, యశ్వంత్, భీమన్న పాల్గొన్నారు.

సబ్ సెంటర్‌లో తనిఖీలు

తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండలంలోని డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి సబ్ సెంటర్‌లో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ డీపీ హెచ్ఎన్ వో భూలోకమ్మ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ఇంటింటి కెళ్లి గర్భిణీలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశ్వారు. మాతా శిశు సంరక్షణపై ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. కౌమార దశ బాలికలు, పాఠశాలకు వెళ్తున్న బాలికలను, ఇంట్లో ఉంటున్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం గర్భిణీలు, బాలింతలు, బాలికలు చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పి.రాంబాబు, ఎస్ఓ కైలాస్, డీపీవో సతీష్, డేటా మేనేజర్ సంపత్ కుమార్, పిహెచ్ ఎన్ రత్నం, హెచ్‌వి మంజుల, హెల్త్ అసిస్టెంట్ దామోదర్ పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతిపై అవగాహన

మాట్లాడుతున్న ఎంఇఓ

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను గిరి విద్యార్థులకు ప్రాథమిక విద్యార్థి దశలోనే అవగాహన పరచి మరచిపోకుండా భావితరాలకు అందించే విధంగా చూడాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్ రావు సూచించారు. మండలంలోని తూటంగి, లైగండ, గుంటగన్నెల పంచాయతీ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులకు, సిపిఎఫ్ నియమించిన వాలంటీర్లకు సిపిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసి సంస్కృతి కనుమరుగు తున్న తరుణంలో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆ సంస్థ ప్రోగ్రాం అధికారి నాగమణి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గాసినాయుడు, సీసీ మాలతి లక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-అరకు లోయ : అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం 1991 - 93 సంవత్సరాల మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా కలుసుకున్నారు. స్థానిక ఎన్ టివి మీడియా ప్రతినిధి , ప్రముఖ వ్యాపారవేత్త కొల్లా రమేష్ బాబు నేతృత్వంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకున్నారు. ఒకరి కష్టసుఖాలను ఒకరు పంచుకుంటూ సందడిగా గడిపారు. కళాశాలకు అవసరమైన స్టేజి ని నిర్మిస్తున్నామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కొల్లా రమేష్ బాబు, జాన్ బాబు, సురేంద్ర, నాగు, రవి, గౌరీ, అరుణ, పార్వతి, రోజా, బేగం తెలియజేశారు.

మొబైల్ మెడికల్ యూనిట్లు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ ద్వారా సిఎస్ఆర్ నిధులతో భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సర్వీస్ ప్రొవైడర్ ద్వారా అరకు, పాడేరు ప్రాంతాలకు ఒక్కొక్కటి చొప్పున రెండు మొబైల్ మెడికల్ యూనిట్‌లను నెల కొల్పారు. ఈ మొబైల్ మెడికల్ యూనిట్‌లను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ శుక్రవారం పాడేరులో ప్రారంభించారు. ఆయా గ్రామాలకు వైద్య సేవలు అందించ నున్నారు. ఈ మొబైల్ మెడికల్ యూనిట్ లో ఒక డాక్టర్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డిఇఓ, పైలట్ అందుబాటులో ఉండి వైద్యం అందిస్తారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్ , జాయింట్ కలెక్టర్ అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమని పటేల్, డిఎం అండ్ హెచ్ ఓ సలీం భాష మైనింగ్ కార్పొరేషన్ మేనేజర్ భవ్య పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

చింతూరులో బహుమతులు అందజేస్తున్న ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

ప్రజాశక్తి-పాడేరు : బాలికల హక్కులు, సంరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,బాలికలు చదివితే సమాజం, కుటుంబం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బాలురు, బాలికలు పట్ల తల్లిదండ్రులు వ్యత్యాసం చూపకూడదని స్పష్టం చేశారు. పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ రోజున బాలల హక్కుల గురించి వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలికలు ఉన్నతంగా చదువుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించాలని చెప్పారు. మార్గదర్శిని కార్యక్రమం ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ 2009 జనవరి 24న నుండి జాతీయ బాలిక దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. బాలికలకు ఎవరైనా మాయమాటలు చెప్తే నమ్మకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరు ఉన్నతంగా చదువుకుని తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. బాలికలు పోషకాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. బాల్యవివాహాలను వ్యతిరేకించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీరావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ, సిడిపిఓ ఝాన్సీరాణి, ఎంపీపీ సొనారి రత్నకుమారి, లగిసిపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, కేజీబీవీ ఉపాధ్యాయులు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: బాలికల హక్కులు, సంరక్షణ కోసం పని చేయాలని ఐసిడిఎస్ సిహెచ్ బాలమణి దేవి పేర్కొన్నారు. శుక్రవారం బాకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికలకు సమాజంలో సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బాలురు, బాలికలు పట్ల తల్లిదండ్రులు వ్యత్యాసం చూపకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకూరు వెంకట రమణ రాజు, వెంకట రావు, ఎంపిటిసి పుణ్యవతి, ఈవో పి ఆర్‌డి అప్పలరాజు పాల్గొన్నారు.

హుకుంపేటలో బాలికా దినోత్సవం

అల్లూరి జిల్లా: జాతీయ బాలికల దినోత్సవం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా చింతూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ మాట్లాడుతూ బాలికలందరు చక్కగా చదువుకుని అన్నీ రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాలలో గణితం, హిందీ, ఆంగ్ల ఉపాధ్యాయులతో పిల్లల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన బాలికలకు ఐటీడీఏ తరపున ప్రత్యేక బహుమతి అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ పి.పుల్లయ్య, ఎస్సై రమేష్, తహశీల్దారు చిరంజీవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయగౌరి, హెచ్ఎం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : బాలికలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక సీడీపీఓ ఎల్.దేవామణి హెచ్ఎం గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సీడీపీఓ దేవమనణి అధ్యక్షతన స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల, సింగంపల్లి ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాల, జడ్డంగి ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడిపిఓ దేవామణి మాట్లాడుతూ ఆడ, మగ అనే బేధం ఉండకుండా మగవారితో సమానంగా అన్ని రంగాలలో ముందు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్ వైజర్లు పి.అరుణ, లత, ఎన్.నాగ జయలక్ష్మి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, రాజవొమ్మంగి మహిళా పోలీస్ పాల్గొన్నారు.

సీలేరు : బాలికల దినోత్సవం సందుర్భంగా జీకే వీధి మండలం సీలేరు బాలికల ఆశ్రమం పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బాలికల రక్షణ మనందరి బాధ్యత -ఆడపిల్లలు దేశానికి గర్వకారణం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాంగి దుర్జో మాట్లాడుతూ బాలికల రక్షణ విషయంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కే వల్లి ప్రసాద్, సచివాలయం మహిళా పోలీస్ రేవతి, బాలికల ఆశ్రమం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల పశు వైద్యశిబిరాలు

హుకుంపేటలో లవణ మిశ్రమం అందజేస్తున్న డాక్టర్ చరణ్

ప్రజాశక్తి-హుకుంపేట: పశు వైద్య శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్య అధికారి చరణ్ కోరారు. మండలంలోని గూడ పంచాయతీ కోడెలి, హుకుంపేట పంచాయితీ డిచింతల వీధి, ఉప్ప పంచాయతీ మత్స్యపురం గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. పశువులు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. మూగజీవాలకు వ్యాధులు సోకిన వెంటనే స్థానిక పశు వైద్య సహాయక సిబ్బందికి సమాచారం అందిస్తే వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఎలు సుజాత, చంద్రకళ, అనిల్, పద్మకుమారి, బాలన్న, బుజ్జబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రామ్ నగరం, డి కొత్తూరు గ్రామాలలో శుక్రవారం పశు వైద్యాధికారి డాక్టర్ కె రాజేష్ కుమార్ అధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు శుక్రవారం నిర్వహించారు. 66 అనారోగ్య పశువులకు వైద్యం అందించారు, గర్భ కోశ వ్యాధులకు నివారణ మందులు, చూలు తనికీలు నిర్వహించారు. 188 పెద్ద పశువులు, 60 పెయ్యలు, 206 గొర్రెలు , మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో పశువులలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తామని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె రాజేష్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ డి శ్రీనివాస్, ఎహెచ్ఎలు వెంకటరమణ, శివ కుమార్, ఈశ్వర్‌రావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కొయ్యూరులో పశువైద్యశిబిరంలో పాడిరైతులతో వైద్యసిబ్బంది

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కుట్టుశిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న తిమోతి

ప్రజాశక్తి-హుకుంపేట: మహిళలకు స్వయం ఉపాధితో పాటు నైపుణ్యం పెంపొందించడానికి ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంజూరీ ఫిలిప్ తిమోతి అన్నారు. మండలంలోని అడ్డారిమెట క్యాంప్ ఆఫీస్ వద్ద శుక్రవారం 38మంది శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. మహిళలు సొంతంగా ఆర్థిక అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో గిరిజన ఆర్థికాభివృద్ధికి, వారి జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి, వారికి చేదోడువాదోడుగా ఉండేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, మున్ముందు కొనసాగిస్తామని అంజూరి ఫిలిప్ తిమోతీ వెల్లడించారు. కార్యక్రమంలో టైలరింగ్ టీచర్ కిల్లో.మచ్చమ్మ, కోఆర్డినేటర్ గురుమూర్తి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

రహదారి నిర్మాణ పనుల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జడ్పిటీసీ వడుగుల జ్యోతి, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ తదితరులు డిమాండ్ చేశారు. జడ్డంగి గ్రామంలో జాతీయ రహదారిలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ, అప్రోచ్ రోడ్డును మండల తాహశీల్దార్ సత్యనారాయణ, సీఐ ఎన్.సన్యాసి నాయుడు, జడ్డంగి ఎస్ఐ చినబాబు, వీఆర్వో నానాజీ, వైసిపి మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, జడ్పిటిసి వి జ్యోతి, సర్పంచ్ కె.మురళీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ప్రజాప్రతినిధులు తెలియజేసిన సమస్యలను సబ్ కలెక్టర్, రోడ్డు కాంట్రాక్టర్లతో మాట్లాడి పరిష్కరిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. దేవాలయాలు, గృహాలకు పరిహారం ఫిబ్రవరి నెలలో వచ్చేలా చేస్తామని సబ్ కలెక్టర్ ఆఫీస్ నుండి వచ్చిన డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- అల్లూరి జిల్లా : అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మర్రివీడు గ్రామానికి చెందిన వీరభద్రరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనకు ఎల్లవరం పీహెచ్సీలో ప్రథమ చికిత్స చేసి కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వీరభద్రరావు వై.రామవరం మండలం పలకజీడి వారపు సంతకు చేపల వ్యాపారం నిమిత్తం వెళ్లారు. చేపల వ్యాపారం తప్ప వీరికి ఎటువంటి జీవనాధారం లేదని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం వారి వీరభద్రరావు బావ అప్పారావు మృతి చెందడంతో మొత్తం కుటుంబానికి వీరభద్రరావు పెద్దదిక్కుగా ఉన్నారు. ఇటువంటి సమయంలో ఈ ప్రమాదం జరగడంతో కుటుంబీకులు కన్నీరు మున్నేరుగా వినిపిస్తున్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా పూర్తి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ ప్రమాదంపై పోలీసువారి వివరణ కోరగా ప్రస్తుతానికి ఎటువంటి ఫిర్యాదు రాలేదని, వస్తే పూర్తి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

బూదరాళ్ల పంచాయతీని విభజించాలని వినతి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయితీ అభివద్ధి జరగాలంటే మూడు పంచాయతీలుగా విభజించాలని ఆ పంచాయితీ సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డ్ మెంబర్ సంజీవ్ పాడేరులోని పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూదరాళ్ల మేజర్ పంచాయతీలోని 36 గ్రామాలు, 8 వేలకు పైబడి జనాభా, విస్తీర్ణం పరంగా దేశంలోనే పెద్దదని తెలిపారు. పంచాయితీ కేంద్రం నుండి గ్రామాలకు 50 కిలోమీటర్లు పైబడి దూరం ఉండడంతో పలు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రజల సౌకర్యార్థం, పరిపాలన సౌలభ్యం కొరకు ఈ పంచాయితీని బూదరాళ్లతో పాటు మరో మూడు బాలరేవుల, పోకలపాలెం, గరిమండ పంచాయితీ కేంద్రాలుగా విభజన చేసి కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయాలని కోరారు. అవకాశం ఉంటే కచ్చితంగా విభజన చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సర్పంచ్, ముత్యాలమ్మ, వార్డ్ మెంబర్ సంజీవ్ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన బల్లెం రమణయ్య పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. అగ్ని ప్రమాదంలో మూడు లక్షల రూపాయలు నగదు, బంగారం, పది క్వింటాళ్ల ధాన్యం, రెండు క్వింటాళ్ల మినుములు, ఇంట్లో ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధిడుడు రమణయ్య వాపోయారు. ప్రమాదం జరిగే సమయంలో ఎవరూ లేకపోవడంతో సమస్తం కాలి బూడిదై కట్టుబట్టలు రోడ్డున పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ రంగంతోనే అభివృద్ధి

'ఉక్కు' జెఎసి దీక్షల్లో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం ద్వారానే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందని, అందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరముందని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు శుక్రవారానికి 1415వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలు ఆధునిక దేవాలయాలని భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చెప్పారన్నారు. భారతదేశ స్వయం ప్రతిపత్తికి, దేశ ప్రజల ప్రయోజనార్థం భారీ పరిశ్రమలను, వ్యవసాయాన్ని జాతీయం చేయాలని రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారన్నారు. అందుకు భిన్నంగా ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రాణం తీయడానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్రలు సాగిస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ద్వారానే సామాజిక న్యాయం అమలవుతోందన్నారు. 2021 జనవరి 27న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూటికి నూరు పాళ్లు అమ్మేయాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించిందని,. అప్పటి నుండి తెలుగు ప్రజలందరి సహకారంతో నేటి వరకూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు మొక్కవోని దీక్షతో పోరాటం చేస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో టిడిపి, జనసేన కూటమి పార్టీలు ఉక్కు కర్మాగారాన్ని రక్షిస్తామని నమ్మబలికి, గెలిచాక మాట నిలబెట్టుకోలేదన్నారు. కేంద్రం ఇచ్చిన అరకొర ప్యాకేజీ ప్లాంట్‌ను రక్షించలేదన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడంతో ఉత్పత్తికి అధిక వ్యయం అవుతోందన్నారు. ప్లాంట్ నష్టాలకు ఇదీ ఒక కారణమన్నారు. లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. ప్లాంట్ సజావుగా నడిచేందుకు వర్కింగ్ కేపిటల్, సొంత గనులు కేటాయించాలని కోరారు. ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకుంటున్నట్టు ప్రధాని ప్రకటించాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షల్లో నాగభూషణం, మద్దెల సుబ్బన్న పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ పరిధి బీసీ కాలనీలో జమాల్ ఖాన్ చారిటబుల్ సంస్థ ద్వారా తాగునీటి బోరు ఏర్పాటు పనులను శుక్రవారం మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు ప్రారంభించారు. బోరు పంపు వేస్తున్న జమాల్ ఖాన్ ట్రస్టుకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బీరక ప్రకాశరావు, బురక కన్నారావు, సవలం రాజు, హరిబాబు, సాయిబాబు, ఉంగుటూరి వెంకటేష్, బింగి సీతమ్మ, పేరంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యూరు : 2024 నవంబర్ 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు శుక్రవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని డౌనూరు పంచాయతీ పాత డౌనూరు గ్రామానికి చెందిన యాళ్ల శ్రీను నవంబర్ 29న పెద్ద పేట నుండి తన ఇంటికి స్కూటీపై వెళ్తుండగా మూలపేట పంచాయితీ బొంకుల పాలెం గ్రామం వద్ద నర్సీపట్నం- చింతపల్లి వెళ్లే రోడ్డులో కుక్క అడ్డంగా రావడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో బంధువులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించి చికిత్స అనంతరం గ్రామానికి తీసుకొచ్చారు. అయితే పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో శ్రీనివా మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. శ్రీనుకు భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు శ్రీను తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నందున ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని టిడిపి నాయకులు తెలిపారు. దహన సంస్కారాల నిమిత్తం టిడిప ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు బండేని సన్యాసిరావు, ఉల్లి వెంకటేశ్వర్లు, సమ్మిరెడ్డి నూకరాజు, పాడి ధారబాబు, రుత్తల జోగినాయుడు, మార తలుపులు నాయుడు, యాళ్ల నాగేష్, కయ్యం నాగేశ్వరరావు, కూడా నాగరాజు, కేదారి నాయక్, శివ, కించా రాము, గుమ్మ అప్పన్న బాబు, పాడి కిరణ్ తదితరులు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని శ్రీను భార్య కోరుతున్నారు.

రోడ్లు, పంట నష్ట పరిహారంపై నిలదీయాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరుగుతున్న మండల పరిషత్ సమావేశంలో మండలంలోని అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల సమస్యపైనా, పంట నష్ట పరిహారం ఇవ్వకపోవడంపై రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు నిలదీయాలని అల్లూరు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల రోడ్డు మరమ్మతులు జరుగుతుంటే గూడెం కొత్త వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు మరమ్మతు పనులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. దశాబ్దాల కాలం నుంచి అంతర్రాష్ట్ర రహదారి అస్తవ్యస్తంగా ఉన్నా ప్రభుత్వం, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. 2024 సెప్టెంబర్ 8న సంభవించిన వరద విపత్తు కారణంగా ప్రధాన రహదారి అస్తవ్యస్తం కావడంతో ఆర్టీసీ బస్సులు సర్వీస్ నడపడం లేదన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తుఫాన్‌లో నష్టపోయిన గిరిజన రైతులుకు నేటి వరకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు.